క్లుప్తంగా

పట్టపగలే విద్యుత్ వెలుగులు



డి.పోలవరంలో పగలే వెలుగుతున్న వీధిలైట్లు

తుని రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో పట్ట పగలే వీధిలైట్లు వెలుగుతుండడంతో విద్యుత్ వృథా అవుతోంది. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ప్రజాధనం వృథా అవుతోంది. డి.పోలవరం, సుభద్రయ్యమ్మపేట, హెచ్.కొత్తూరు తదితర గ్రామాల్లో 365 రోజులు పగలు, రాత్రీ తేడా లేకుండా వీధిలైట్లు వెలుగుతున్నాయి. పంచాయతీ అధికారులు, సచివాలయ సిబ్బంది నిర్వహణ చేపట్టకపోవడంతో విలువైన విద్యుత్ వృథా అవుతోంది. ప్రభుత్వం విద్యుత్ ఆదా చేయాలని చెబుతున్నా క్షేత్రస్థాయిలో పట్టించుకోవడంలేదు. మరో పక్క బిల్లులు మోత మోయాల్సి వస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వీధిలైట్ల నిర్వహణ చేపట్టాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

ఎక్సైజ్ దాడులు



ఎక్సైజ్ సిబ్బంది స్వాధీనం చేసుకున్న సారా తయారీ సామగ్రి

ప్రత్తిపాడు: మండలంలో సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో ప్రధాన జలాశయమైన సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లోని సారా స్థావరాలపై దాడి చేసి 1,600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. దీనిలో పలివల రవి, వేమగిరి సాయిలపై కేసులు నమోదు చేశామని చెప్పారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై పి.వంశీరామ్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

ప్రత్తిపాడు: గ్రామ స్థాయి నుంచే కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లిపూడి రాంబాబు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం ప్రత్తిపాడు అంబేడ్కర్ కళా మందిర్ వద్ద ఆయన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే ప్రజలకు మేలు జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మండల అధికారుల నంబర్లు

ఏలేశ్వరం:

తహసీల్దార్	- 98499 03921
ఎండీపీఓ కార్యాలయం	- 98493 36599
ఎంఈఓ	- 94942 10420
ఏపీఓ	- 70939 98217
ఏపీఎం	- 73373 16825
ఎస్సై	- 94409 04835
మండల వైద్యాధికారి	- 99662 06287
నగర పంచాయతీ కమిషనర్	- 96520 65430
మండల వ్యవసాయాధికారి	- 83310 56609
ఫారెస్టు రేంజర్	- 94403 28540

కిర్లంపూడి:

తహసీల్దార్	- 98499 03886
ఎంపీడీఓ	- 91009 70617
ఎంఈఓ	- 90009 12335
ఎంఈఓ-2	- 98487 43433
ఏపీఓ	- 83744 46309
ఏపీఎం	- 96523 04151
ఎస్సై	- 94409 04834
కిర్లంపూడి వైద్యాధికారి	- 77024 41029
వీరవరం వైద్యాధికారి	- 89193 43269
గెద్దనాపల్లి వైద్యాధికారి	- 81066 28018
మండల వ్యవసాయాధికారి	- 83310 56601
కిర్లంపూడి పశువైద్యాధికారి	- 89580 44698
భూపాలపట్నం పశువైద్యాధికారి	- 95429 08025
వీరవరం పశువైద్యాధికారి	- 89789 41840
హౌసింగ్ ఏఈ	- 70939 30461
ఇంజినీరింగ్ అధికారి	- 97014 77778

మండల అధికారుల నంబర్లు

కోటనందూరు:

తహసీల్దార్	80088 03205
ఎంపీడీఓ	98496 63415
మండల వైద్యాధికారి	76750 32399
వ్యవసాయాధికారి	83310 56617
ఎంఈఓ-1	89856 02864
ఎంఈఓ-2	96529 81857
కోటనందూరు పశువైద్యాధికారి	86398 13895
పాతకొట్టాం పశువైద్యాధికారి	94919 34613
ఎస్సై	94409 00773
వెలుగు ఏపీఎం,	80088 04895

పుచ్చకాయతో కూల్ కూల్

- మండే ఎండల నుంచి ఉపశమనం
- మార్కెట్‌లో జోరుగా విక్రయాలు

గోకవరం: వేసవి ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు ఎక్కువ మంది పుచ్చకాయలను ఆశ్రయిస్తున్నారు. వేసవి తాపం తగ్గించే ప్రధాన పండ్లలో పుచ్చకాయకు ప్రథమ స్థానం ఉంటుంది. వేసవిలో విరివిగా లభించే పుచ్చకాయలంటే చిన్నా, పెద్దా అందరికీ ఇష్టమే. పండ్ల జాతిలో ఆకారంలో పెద్దగా ఉండే పుచ్చకాయలను కొనుగోలు చేసి కుటుంబ సభ్యులంతా కలిసి తినేందుకు ఆసక్తి చూపుతారు. ప్రస్తుతం వేసవిలో ఎండలు విపరీతంగా మండుతుండడంతో వేసవి తాపం తగ్గించే పుచ్చకాయల అమ్మకాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే భానుడు ప్రతాపం చూపిస్తుండడంతో ప్రజలు పుచ్చకాయలు తింటూ ఉపసమనం పొందుతున్నారు. నియోజకవర్గంలో జగ్గంపేట, గోకవరం, కిర్లంపూడి, గండేపల్లి మండలాల్లో పుచ్చకాయల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వేసవికి ముందు మూడు నెలల నుంచే పుచ్చకాయల అమ్మకాలు జోరందుకున్నాయి.

ధర పెరిగినా..

రాష్ట్రంలో పుచ్చకాయ పంట లేకపోయినప్పటికీ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని పలువురు వ్యాపారస్తులు తమిళనాడు నుంచి దిగుమతి చేసి విక్రయాలు సాగించారు. ప్రస్తుతం రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి దిగుబడి రావడంతో అన్ని మండలాల్లో పుచ్చకాయల విక్రయాలు ఊపందుకున్నాయి. గతేడాదితో పోల్చితే పుచ్చకాయ ధరలు బాగా పెరిగాయి. గతేడాది కేజీ రూ.30 ధర పలకగా ఈ సంవత్సరం రూ.50 వరకు విక్రయిస్తున్నారు. కాయ పరంగా చూస్తే పరిమాణాన్ని బట్టి ఒక్కో కాయని రూ.120 వరకు విక్రయాలు సాగిస్తున్నారు. ధర ఎలా ఉన్నప్పటికీ వేసవి తాపం నుంచి ఉపసమనం పొందేందుకు ప్రజలు పుచ్చకాయల బండ్ల వద్దకు ఎగబడుతున్నారు. ఉదయం పది గంటల నుంచి ఎండ ప్రభావం ఉండటంతో అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. జగ్గంపేట, గోకవరంలో సోమవారం వారపు సంతను పురస్కరించుకుని ఆటోల్లో తీసుకువచ్చి విక్రయాలు సాగిస్తున్నారు. ఆటోలతో ప్రతీ వీధిలో తిరుగుతూ ప్రజల ముంగిట్లోకి తీసుకువెళ్లి అమ్మకాలు నిర్వహించడంతో వీటి అమ్మకాలు పెరిగాయి.



గోకవరంలో పుచ్చకాయ అమ్మకాలు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న పుచ్చకాయలు

పుచ్చతో ఎన్నో ఉపయోగాలు

నీటి శాతం ఎక్కువగా ఉండే పుచ్చకాయను తినడం వలన వేసవి తాపం నుంచి బయట పడవచ్చని వైద్యులు చెబుతున్నారు. వేసవిలో శరీరానికి అవసరమైన ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరిస్తూ వడదెబ్బకు గురికాకుండా పని చేస్తుంది. కేలరీలు తక్కువగా ఉండటంతో ఊబకాయం తగ్గడానికి దోహదపడుతుంది. రక్తపోటును తగ్గించడంతో పాటు కిడ్నీ రాళ్లను కరిగిస్తుంది. వీటితో పాటు మరెన్నో ఉపయోగాలు పుచ్చకాయలు తినడం ద్వారా పొందవచ్చు.

సరస్వతి పుష్కరాలకు బస్సు సర్వీసు

తుని: తెలంగాణా రాష్ట్రం కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి పుష్కరాలకు తుని నుంచి ఈ నెల 23వ తేదీన బస్సు నడుపుతున్నామని తుని డిపో మేనేజరు కిరణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. సూపర్ లగ్జరీ బస్సు 23న బయలుదేరి 26న తిరిగి తుని చేరుకుంటుందన్నారు. టికెట్ ధర రూ.2700 నిర్ణయించామన్నారు. టూర్‌లో వరంగల్ భద్రకాళీ మాత, వేములవాడ రాజరాజేశ్వరి అమ్మవారు, కొండగట్టు ఆంజనేయస్వామి, ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహ స్వామి, కాళేశ్వరం మహా కాళేశ్వరుడు, సరస్వతి పుష్కర స్నానం, రామప్పలోని రామప్ప ఆలయ దర్శనం ఉంటుందన్నారు. రూమ్ అద్దె యాత్రికులు భరించాలన్నారు. మరిన్ని వివరాలకు 8555058080, 9063366433, 7382913016 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

గోకవరం: గోదావరి, ప్రాణహిత, సరస్వతీ నదుల త్రివేణి సంగమ స్థానమైన కాళేశ్వరం సరస్వతీ పుష్కరాలకు ఏపీఎస్ ఆర్టీసీ గోకవరం డిపో నుంచి ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ సుచరిత మార్గరెట్ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు యాత్రికుల సౌకర్యార్థం గోకవరం డిపో నుంచి ఈనెల 21వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు సూపర్ లగ్జరీ సర్వీస్‌తో బస్సు సర్వీసు నడుపుతున్నామని, ఈ బస్సు కాళేశ్వరం, కొండగట్టు, వేములవాడ, వరంగల్ వేయి స్తంభాల ఆలయం, భద్రకాళీ అమ్మవారి ఆలయం, రామప్ప ఆలయాలను సందర్శన ఉంటుందన్నారు. టిక్కెట్టు ధర ఒక్కక్కరికీ రూ.2,200గా నిర్ణయించామన్నారు. వివరాలకు 7382910258, 7382910321 నంబర్లను సంప్రదించాలన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



కొత్త యర్రవరంలో పార్టీ శ్రేణులతో కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

ఏలేశ్వరం: పార్టీ బలోపేతానికి శ్రేణులు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. మండలంలోని కొత్త యర్రవరంలో ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో విజయమే లక్ష్యమన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదవుతున్నా ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవరణ కార్యదర్శులు సామంతుల సూర్యకుమార్, బి.అప్పలరాజు, జిల్లా అధికార ప్రతినిధి సుంకర రాంబాబు, పైల విజయ్‌కుమార్, యిజనగిరి శివప్రసాద్, గుమ్ములూరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. తొలుత శంఖవరం మండలం కత్తిపూడిలో ముద్రగడ గిరిబాబు కోర్లమ్మ అమ్మవారి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్తిపాడు మండలం శరభవరంలో పలు కార్యక్రమాలు ఆయన పాల్గొన్నారు. ఆయన వెంట పార్టీశ్రేణులు పాల్గొన్నారు.

అలయన్స్ క్లబ్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం



తునిలో అలయన్స్ క్లబ్ కార్యవర్గం

తుని: అలయన్స్ క్లబ్ సామాజిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారించాలని ఆ క్లబ్ ఇంటర్నేషనల్ చైర్మన్ బి.తిరుపతిరాజు అన్నారు. ఆదివారం స్థానిక సీతరామా యోగా సెంటర్లో అలయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా కుచ్చర్లపాటి భీమరాజు, అధ్యక్షుడిగా జీఏ నాయుడు, ఉపాధ్యక్షులుగా వీఎస్ఆర్ ఆంజనేయప్రసాద్, కుసుమంచి సత్యనారాయణ, దండెం రామచంద్రరావు, కార్యదర్శిగా నెల్లిపూడి రాజబాబు, కోశాధికారిగా కేవీ రమణ ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా గవర్నర్ ఉషారాణి, పరవాడ తాతబాబు, నామన రవి, నాగేశ్వరరావు, సీతారాంలు నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

తుని: స్థానిక జీఆర్పీ పరిధిలోని బయ్యవరం-నరసింగపల్లి మధ్యలో తుని నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న రైలు నుంచి 30 ఏళ్ల వయసు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి జారి పడి మృతి చెందాడని ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం అందిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి తెలిపిన వివరాలు ప్రకారం.. మృతుడికి సంబంధించిన వివరాలు తెలియలేదని, నీలం రంగు టీషర్ట్‌పై దాల్మియా సిమెంట్ లేబుల్ ఉందని, నలుపు రంగు జీన్ ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు.



మృతి చెందిన వ్యక్తి

పదవి ఒకరిది.. పెత్తనం మరొకరిది

- సమస్యలు పట్టించుకోని పాలకవర్గం
- సూరంపాలెం గ్రామస్తుల ఇబ్బంది

గండేపల్లి: సమస్యలను పరిష్కరించి, అండగా ఉంటారని ప్రజా ప్రతినిధులను ప్రజలు ఎన్నుకుంటారు. అయితే ఇక్కడ ప్రజల ఎన్నుకున్నవారు పేరుకే పదవిలో ఉన్నారు పెత్తనం మాత్రం మరొకరు చెలాయిస్తున్నారు. దీంతో గ్రామంలో సమస్యలను పట్టించుకోకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సూరెంపాలెం గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలోని ఒకటో వార్డులో మురుగు నీటితో నిండిన డ్రైనేజీలు, గత కొన్ని రోజులుగా మరమ్మతులకు గురైన వీధి దీపాలతో అవస్థలు పడుతున్నారు. కొన్ని డ్రైన్లు లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. తాము ఎదుర్కొంటున్న సమస్యలపై పంచాయతీలో తెలియపరిచినప్పటికీ ప్రొటోకాల్ లేని వ్యక్తి పెత్తనం చెలాయిస్తు తమ వీధిలో సమస్యలను పట్టించుకోవడంలేదని గ్రామస్తులు చెబుతున్నారు. గత కొన్ని సంవత్సరాల నుంచి వర్షం నీరు, ఇళ్లల్లో మురుగు నీరు పారే పుంత మార్గంలో గ్రావెల్‌ను రోడ్డుకు ఎత్తుగా వేయడంతో మురుగు నీరు, వర్షం నీరు రోడ్లపైనే నిలిచిపోతోందని వార్డు సభ్యుడు బత్తిన శ్రీనివాస్, మాజీ వార్డు సభ్యుడు ఇజ్జపురెడ్డి రామకృష్ణ, స్థానికులు బొట్ల సాయిబాబు, రాంబాబు, సత్తిబాబు, వెంకటేష్, బూరయ్య, ఇజ్జపురెడ్డి సూర్యనారాయణ, సత్యనారాయణ తదితరులు చెబుతున్నారు. గ్రావెల్‌తో నింపిన పుంత మార్గంలో డ్రైన్లు నిర్మించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోయారు. ఎటువంటి ప్రోటోకాల్ లేని వ్యక్తి పెత్తనం చెలాయిస్తూ మాపై కక్షసాధింపునకు పూనుకుంటున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పుంత రోడ్డుపై నిలిచిన వర్షం నీరు, ఇళ్లల్లో వాడకం నీరు చూపుతున్న స్థానికులు



ఒకటో వార్డులో అధ్వానంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను చూపిస్తున్న స్థానికుడు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గోకవరంలో కలుసుకున్న పదో తరగతి పూర్వ విద్యార్థులు



రాజపూడిలో కలుసుకున్న 2001-2006 బ్యాచ్ విద్యార్థులు

గోకవరం: గ్రామంలో 2001లో పదో తరగతి చదువుతున్న పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక సూర్యఫంక్షన్ హాల్‌లో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధలు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో సందడి చేశారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. సాయంత్రం వరకు సందడిగా గడిపి తీపిజ్ఞాపకాలతో వీడ్కోలు చెప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో సుమారు వంద మందికి పైగా పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

జగ్గంపేట: జగ్గంపేట మండలం రాజపూడి ఉన్నత పాఠశాలలో 2001-2006 మధ్య విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. ఆ నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఆనాటి ఉపాధ్యాయులను సత్కరించారు. అనంతరం పదో తరగతిలో 575 మార్కులు సాధించిన విద్యార్థినికి రూ.3 వేల నగదు బహుమతిని అందజేశారు. ప్రతి ఏటా పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తామని, పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

యువత క్రీడల్లో రాణించాలి

ఏలేశ్వరం: యువత క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం స్వర్గీయ వరుపుల రాజా స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. పోటీల్లో విజేతలైన వారికి మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి రూ.15 వేలు ఇవ్వనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

పశువుల తొట్టెలు సరే.. నీళ్లేవీ..

తుని రూరల్: కూటమి ప్రభుత్వం గ్రామానికి ఒకటి చొప్పున పశువుల తొట్టెలు నిర్మిస్తుండగా ఉన్న తొట్టెల్లో నీళ్లేవని పాడి రైతులు నిలదీస్తున్నారు. ఎనిమిదేళ్ల కిందట జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పలు గ్రామాల్లో వేసవిలో పశువుల దాహార్తి తీర్చేందుకు నీళ్ల తొట్టెలు నిర్మించారు. నీళ్ల తొట్టెలు నిర్మించిన మొదట్లో పంచాయతీ అధికారులు కుళాయిలు ద్వారా తొట్టెలను నింపి పశువులకు తాగునీరు అందుబాటులో ఉంచేవారు. క్రమంగా పంచాయతీ అధికారులు పశువుల తొట్టెల్లో నీళ్లు నింపడం మరిచారు. మండువేసవిలోనూ చుక్కనీరు లేకుండా ఎండిపోయిన తొట్టెలే దర్శనమిస్తున్నాయి. ఉన్న తొట్టెల్లో నీళ్లు నింపడం మరచిన అధికారులు కొత్తగా పశువులకు నీళ్ల తొట్టెలు నిర్మిస్తున్నారు. దీనివల్ల పశువులకు తాగునీరు అందించాలన్న లక్ష్యం నెరవేరడంలేదు. ప్రభుత్వ ఖజానా నుంచి ప్రజాధనం వృథా అవతోంది. అవసరమైన పాడి రైతులు తాగునీటి కోసం తమ పశువులను ఇళ్లకు, బోరుబావులు, సమీపం గెడ్డలకు తోలుకుని వెళ్లాల్సి వస్తోంది. అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పశువుల తొట్టెలపై దృష్టి సారిస్తే వేసవిలో దహార్తి తీర్చినట్టవుతుంది.



ఎస్.సూరవరంలో చుక్క నీరు లేకుండా ఎండిపోయిన పశువుల నీళ్ల తొట్టె

గ్రామాల్లో తిరంగా ర్యాలీలు



గోకవరంలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న కంబాల శ్రీనివాస్‌రావు, తదితరులు



ర్యాలీలో 330 అడుగుల జాతీయ జెండా

గోకవరం: పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో దేశ సైనికులకు సంఘీభావం తెలుపుతూ విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామ సేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. సుమారు 330 అడుగుల భారీ జాతీయ జెండాతో ఈ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి, దేవీచౌక్ మీదగా మండల పరిషత్ కార్యాలయం వరకు సాగింది. అనంతరం యుద్ధంలో వీరమరణం పొందిన మురళీనాయక్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించి, భారత్ మాజీ జవాన్లు జవాన్లు రామకృష్ణ, నరేష్‌కుమార్‌లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ, బీజేపీ మండలాధ్యక్షుడు ఇనకోటి బాపన్నదొర, నాయకులు వరసాల ప్రసాద్, బత్తుల నానాజీ, దాసరి ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేటలో..

జగ్గంపేట: భారత్ సైనికులకు మద్దతుగా ఆదివారం జగ్గంపేటలో తిరంగా ర్యాలీ నిర్వహించింది. బీజేపీ జగ్గంపేట నియోజకవర్గ కన్వీనర్ దాట్ల కృష్ణవర్మ ఆధ్వర్యంలో స్థానిక పోలీసు స్టేషన్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా జాతీయ జెండాలతో బీజేపీ నేతలు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు భారతదేశ కీర్తి ప్రశంసిస్తూ నినాదాలు చేస్తు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఆపరేషన్ ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచ దేశాలకు భారతదేశం శక్తి సామర్థ్యాలు తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు కామినేని జయశ్రీ, జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టా గంగరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వీర జవాన్లకు నివాళులు

తుని: ఆపరేషన్ సిందూర్‌లో అశువులు బాసిన జవాన్లకు నివాళులు అర్పిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఆదివారం జిల్లా పిరషత్ బాలికోన్నత పాఠశాల నుంచి గొల్ల అప్పారావు సెంటర్, తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర పార్టీ సూచనల మేరకు జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు ఆదేశాలతో ర్యాలీ నిర్వహించామని తుని నియోజకవర్గం కన్వీనర్ వెలుగుల గోపాలకృష్ణ తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ పాకిస్తాన్ ఉగ్రమూకలకు తగిన గుణపాఠం చెప్పారన్నారు. తుని పట్టణ శాఖ అధ్యక్షుడు కాదంబరి రామకృష్ణ, ఆకెళ్ల శాస్త్రి, నారాయణాచార్యులు, కుచ్చర్లపాటి అనిరుద్ వర్మ, రమణ, వీరబాబు, శివ, పవన్‌కుమార్ పాల్గొన్నారు.



తునిలో ర్యాలీ నిర్వహించిన బీజేపీ నాయకులు



జగ్గంపేటలో ర్యాలీ నిర్వహించిన బీజేపీ నేతలు

'రియల్'లో అవగాహన సదస్సులు అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ మురళీకృష్ణ

- జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ మురళీకృష్ణ

బోట్‌క్లబ్: రోజురోజుకూ భవన నిర్మాణ, లేఅవుట్ అభివృద్ధి ప్రాజెక్టులు కుంటుపడుతున్న తరుణంలో రియల్ ఎస్టేట్ రంగాల్లో ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు నారెడ్కో వంటి సంస్థలు బిల్డర్లకు అవగాహన సదస్సులు నిర్వహించాలని జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. స్థానిక జేఎన్‌టీయూకేలో ఆదివారం నారెడ్కో (నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్) ఆధ్వర్యంలో రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్-ఖర్చు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. రోజురోజుకూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా బిల్డర్లు ఒకరికొకరు పోటీ పడి, రేట్ల విషయంలో రాజీ పడి నష్టాల బారిన పడుతున్నారన్నారు. నారెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు గద్దె చక్రధరరావు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణం, రియల్ ఎస్టేట్ రంగాలకు లాభం చేకూర్చేలా తీసుకొస్తున్న నూతన చట్టాలపై సభ్యులకు అవగాహన అవసరమన్నారు. రియల్ ఎస్టేట్ ప్రాజెక్టు నిర్వహణ-ప్రాజెక్టు విజయవంతం చేయడం, ప్రాజెక్టు ఖర్చులపై నారెడ్కో కాకినాడ చాప్టర్ అధ్యక్షుడు పేర్ల వెంకట వేణుగోపాలరావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో నారెడ్కో సెక్రటరీ ఉపేష్, ట్రెజరర్ నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ దండెం రామకృష్ణ, ఉపాధ్యక్షులు వీవీ రమణమూర్తి పాల్గొన్నారు.